ఏపీ కార్ల్‌కు నేడు జర్మన్ బృందం రాక

పులివెందుల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ కార్ల్‌కు జర్మన్ బృందం రాక సందర్భంగా ఇక్కడ చేపట్టిన ఏర్పాట్లను మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ఏపీ కార్ల్‌లో ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయం సాగుతోంది. దీనిని పరిశీలించేందుకు బుధవారం జర్మనీకి చెందిన రాయబారుల బృందం రానుంది. ఇక్కడ సాగుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని, అలాగే ఏపీ కార్ల్‌లోని ల్యాబ్‌లు తదితర వాటిని పరిశీలించనున్నారు. అలాగే జర్మన్ బృందంతో ఇంటరాక్షన్ ఉండడంతో కలెక్టర్ సెమినార్ హాల్, ల్యాబ్‌లు తదితర వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చిన్నయ్య, ఏపీ కార్ల్ ఇన్‌చార్జి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి రైతుకు భరోసా

- కర్నూలు ప్యాకేజీ కడప జిల్లా రైతులకూ వర్తింపు
- హెక్టారుకు రూ.50వేలు
- ఫలించిన కలెక్టర్, ఎమ్మెల్యే పుత్తా కృషి
- నేడో, రేపో ఉత్తర్వులు

(కడప-ఆంధ్రజ్యోతి): ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదనే సామెత ఉంది. మేలేమో కానీ ఈసారి ఉల్లి సాగు చేసిన రైతు మళ్లీ సాగు చేయకూడదనే పరిస్థితి దాపురించింది. అకాల వర్షాలు, గిట్టుబాటు ధర లేకపోవడంతో ఉల్లి రైతు కంట కన్నీరు కారింది. పొలాల్లోనే పంటను వదిలేయగా, కొందరు రైతులు మార్కెట్‌కు తీసుకుపోతే ట్రాన్స్‌పోర్టు ఖర్చు భారమని భావించి బయట పారబోశారు. ఉల్లి రైతులు గిట్టుబాటు ధర లేక ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టరు చెరుకూరి శ్రీధర్ ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంతో పాటు మద్దతు ధరతో కొనుగోలు చేసేలా ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. అయితే ఆ ధర రైతులకు సరిపోలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఉల్లి రైతులు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతుండడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉల్లి రైతులకు గుడ్‌న్యూస్ చెప్పారు. హెక్టారుకు రూ.50వేలు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. ఈ ప్యాకేజీని పొరుగున ఉన్న కర్నూలు జిల్లాకు వర్తింపజేశారు. దీంతో కడప జిల్లా రైతుకు కూడా కర్నూలు ప్యాకేజీ ఇవ్వాలంటూ కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. అలాగే పలుమార్లు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకూ ఇక్కడి పరిస్థితిని వివరించారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబునాయుడు కడప జిల్లా రైతులకు కూడా హెక్టారుకు రూ.50వేలు ఆర్థిక సాయం అందించేందుకు సూత్రప్రాయంగా అంగీకరించారని సమాచారం. నేడో రేపో అధికారికంగా ఉత్తర్వులు రానున్నట్లు చెబుతున్నారు.



దువ్వూరు మండలం మూడిండ్లపల్లెలో రైతు పొలంలోనే వదిలేయడంతో ఉల్లిగడ్డలను గంపల్లో తీసుకెళుతున్న గ్రామస్థులు

ఉల్లి రైతుల కష్టాలు

జిల్లాలోని కమలాపురం, మైదుకూరు, పులివెందుల, జమ్మలమడుగు నియోజకవర్గాల్లో సుమారు 14,600 ఎకరాల్లో ఉల్లి సాగుచేశారు. గత ఏడాది ఉల్లి ధర ఆశాజనకంగా ఉండడంతో ఈసారి పెద్దఎత్తున పంట సాగుచేశారు. వీరపునాయునిపల్లె మండలంలోని వెల్దుర్తి, వెంకటాపురం, కొమ్మద్ది, అడవిచెర్లోపల్లె.. ఎర్రగుంట్ల మండలంలోని చిలంకూరు, ఒంటిగారిపల్లె, దండుపల్లె.. పెండ్లిమర్రి మండలం కమలాపురం, మైదుకూరు, దువ్వూరు, వేముల, లింగాల మండలాల్లో ఉల్లి పెద్ద ఎత్తున సాగుచేశారు. పంట చేతికి వచ్చే సమయానికి వర్షాలు రావడం, మార్కెట్‌ను ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఉల్లి ముంచెత్తడం, ఎగుమతులు లేకపోవడంతో ఉల్లి ధర ఒక్కసారిగా ఢమాల్ అయింది. క్వింటా సన్నగడ్డలు రూ.250 నుంచి రూ.300 చెబుతుండగా, పెద్ద గడ్డలైతే రూ.600 పలుకుతున్నాయి. ఈ ధర రైతులకు శరాఘాతంగా మారింది. పంటను పొలం నుంచి మార్కెట్‌కు తీసుకువెళ్లే ట్రాన్స్‌పోర్టు ఖర్చు కూడా రాకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. సుమారు ఎకరాకు రూ.50వేల నుంచి రూ.70వేల దాకా పంట పెట్టుబడి పెట్టి సాగు చేశారు. పంట చేతికొచ్చేసరికి గిట్టుబాటు ధరలేదు. సాగు పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. దీంతో దువ్వూరు మండలం ముడుంపల్లెకు చెందిన ఓ రైతు పంటను పారవేయగా, మరో రైతు పంటను పీకేశారు. మద్దతు ధర ప్రకటించాలంటూ రైతులు వాపోయారు. ఈ నేపథ్యంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రత్యేక దృష్టిసారించడంతో.. ఉల్లి సాగుచేసిన రైతులకు హెక్టారుకు రూ.50వేలు ఇచ్చేందుకు సీఎం సానుకూలంగా స్పందించారని.. ఈ ఏమరకు రెండురోజుల్లో ఆదేశాలు రావచ్చని చెబుతున్నారు.



గిజి.. బిజీ

గిజిగాడిని మించిన అద్భుతమైన ఇంజనీరు ఉండరేమో. సురక్షితమైన ప్రదేశాన్ని ఎంచుకోవడం దగ్గర నుంచి.. గూడును పకడ్బందీగా అల్లుకోవడం వరకూ వీటి ప్రతిభ అనితరసాధ్యం. ఒంటిమిట్ట నుంచి రాజంపేట వెళ్లే దారిలో మంటపంపల్లె వద్ద ఓ టెంకాయ చెట్టుకు పెద్దసంఖ్యలో గిజిగాడి గూళ్లు ఉన్నాయి. పిల్లలు పుట్టి పెరిగేకొద్దీ కొత్త ఇళ్లు వెలిసినట్టు.. ఇక్కడా కొత్తగా బుజ్జిపిట్టలు బిజీబిజీగా గూళ్లు అల్లుతున్నాయి. ఆ దారిలో పోయేవారు.. ఆగిమరీ వీటిని చూసి వెళుతున్నారు.

- ఫొటోలు :
స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప

ప్రజలకు నాణ్యమైన ఇంధన సేవలు

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రొద్దుటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన ఇంధన సేవలు అందించడమే లక్ష్యంగా రెవెన్యూ శాఖ నిర్వహణ లో పెట్రోల్ బంకును ఏర్పాటు చేశామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం ప్రొద్దుటూరు తహశీల్దారు కార్యాలయం వద్ద రెవెన్యూ సంక్షేమ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డితో కలసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ వారు నిర్వహి స్తున్న ఈ పెట్రోల్ బంకు రాయలసీమలోనే మూడోదన్నారు. భారత్‌పెట్రోలియం సంస్థకు చెందిన ఈ ఫిల్లింగ్ స్టేషన్‌లో నాణ్యతతో కూడిన పెట్రోల్ డీజల్‌ను ప్రజలకు అందిస్తారన్నారు. అనంతరం పెట్రోల్ బంకు ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు గంగయ్య, డిప్యూటీ తహశీల్దారులు అజయ్‌బాబు, సుదర్శన్, శివప్రసాద్, భారత్ పెట్రోలియం సంస్థ మేనేజర్ వేణుగోపాల్, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పాల్గొన్నారు.



పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

వనరులను సద్వినియోగం చేసుకోండి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయంలో లభించే వనరులను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంచుకోవడంతో పాటు సమాజానికి ఉపయోగపడే ప్రభావవంతమైన మానవ వనరుగా మారాలని యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ ఆకాంక్షించారు. మంగళవారం అన్నమాచార్య సెనేట్ హాల్లో విశ్వవిద్యాలయ విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుని తప్పక పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాటా్ల డుతూ వైవీయూ నూతనంగా ఆవిర్భవించినప్పటికి అతి పాత విశ్వవిద్యాలయాలతో అన్ని అంశాల్లో పోటీపడుతోందన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి మీ సలహాలు కూడా స్వీకరిసా ్తనన్నారు. విశ్వవిద్యాలయంలో లభించే వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విశ్వవిద్యాలయ ప్రగతికి మీ సహకారం అవసరమన్నారు. ఈ సమావేశంలో వైవీయూ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న వైవీయూ వీసీ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్

నకిలీ మద్యానికి చెక్

- 'సురక్ష' యాప్‌ను ఆవిష్కరించిన ఎక్సైజ్‌శాఖ

కడప క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. జిల్లాలో సైతం ఎక్కడ చూసినా కల్తీ మద్యంపై చర్చ నడుస్తోంది. జిల్లాలో నకిలీ మద్యం లేదని ఎక్సైజ్‌శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ మందుబాబులకు ఏ మూలనో అనుమానం ఉంది. ఈ నేపథ్యంలో నకిలీ మద్యానికి చెక్ పెట్టేందుకు ఎక్సైజ్ శాఖ 'సురక్ష మొబైల్ యాప్'ను ఆవిష్కరించింది. మద్యం కొనుగోలు చేసేటప్పుడు ఈ యాప్ ద్వారా స్కాన్ చేస్తే అది ఒరిజినలో నకిలీనో తెలిసిపోతుంది. సురక్ష యాప్‌తో నకిలీకి చెక్ పడి నాణ్యమైన మందు అందనుంది. ముందు కస్టమర్లు ఈ యాప్‌ను తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ యాప్ ద్వారా ప్రతి బాటిల్‌కు సంబంధించిన వివరాలను స్కాన్ చేసి తెలుసుకోవచ్చు. మద్యం సీసా కొనుగోలు చేసేటప్పుడు సురక్ష యాప్ ద్వారా సీసా మూత మీద ఉన్న సీల్‌ను (లేబుల్ కాదు) స్కాన్ చేయాలి. మద్యం బాటల్ ఒరిజినలా, నకిలీదా అన్నది స్పష్టమవుతుంది. ఒకవేళ నకిలీది అయితే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 14405కు ఫిర్యాదు చేయవచ్చని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. అయితే ఈ స్కాన్ బీర్‌బాటళ్లకు పనిచేయదని తెలిపారు.

ఇంటినుంచి వృద్ధుల గెంటివేత

- రుణదాత దౌర్జన్యం

పులివెందుల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పునకు వడ్డీ మొదలు చెల్లించాలని రుణదాత ఒత్తిడి చేయడంతో కొడుకు పరారయ్యాడు. దీంతో ఆ ఇంటికి తాళం వేసి అతడి తల్లిదండ్రులను బయటకు గెంటేశాడు రుణదాత. బాధితుల కథనం మేరకు..

పులివెందుల పట్టణంలోని నారాయణ కళాశాలకు వెనుక వైపున మైత్రీ లేఅవుట్‌లో వృద్ధ దంపతులు చలమయ్య, సోమక్క తమ రెండో కుమారుడు చలమానాయుడుతో పాటు ఉంటున్నారు. చలమానాయుడు కొంతకాలం బంగారు వ్యాపారం చేశాడు. అనంతరం ఇళ్లను కట్టి అమ్ముతున్నాడు. ఈ నేపథ్యంలో తమ ఇంటిని ఏడాదిన్నర క్రితం రూ.55లక్షలకు తనఖా పెట్టాడు. అసలు, వడ్డీ కలిపి రెండేళ్లకు తీర్చేలా గడువు పెట్టుకున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు గడువు ఉన్నా.. అప్పు ఇచ్చిన వ్యక్తి బాకీ తీర్చాలని ఒత్తిడి తెచ్చాడు. ఈ ఒత్తిడికి తట్టుకోలేక చలమానాయుడు భార్య పిల్లలను తీసుకుని ఇంట్లోనించి వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలో మంగళవారం అప్పు ఇచ్చిన వ్యక్తి వచ్చి వృద్ధ దంపతులను బయటకు పంపిం చేసి ఇంటికి, గేటుకు తాళాలు వేశాడు. దీంతో వృద్ధ దంపతులు లబోదిబోమన్నారు. గడువు తీరిన తర్వాత తాము వడ్డీ, అసలు చెల్లించలేకపోతే ఇంటిని స్వాధీనం చేసుకోవచ్చని.. ఆరు నెలల ముందే ఇంటిపైకొచ్చి దాడి చేసి తమను ఇలా రోడ్డుపైకి ఈడ్చడం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ సీతారామిరెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. తమకు ఫిర్యాదు అందిందని, రేపు ఉదయం ఇరు వర్గాలను పిలిపించి మాట్లాడతామని చెప్పామన్నారు.



ఇంటి నుంచి గెంటివేయడంతో కట్టుబట్టలతో బయట ఉన్న వృద్ధులు

టీచర్లకు విదేశీ పర్యటన

ప్రపంచస్థాయి విద్యావిధానాలపై అధ్యయనం ● 160 మంది ఉపాధ్యాయులకు అవకాశం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో కొత్త దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఉపాధ్యాయుల వృత్తిగత నైపుణ్యాల పెంపుకోసం విదేశీ అధ్యయన పర్యటనలు చేపట్టే ప్రణాళిక సిద్ధమైంది. ప్రపంచంలోని ఉత్తమ విద్యా విధానాలను తెలుసుకుని, ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం. ఈ విదేశీ పర్యటనలు విద్యారంగంలో కొత్త మార్గదర్శకాలు, నూతన ఆలోచనలకు దారితీయనున్నాయి. భవిష్యత్ తరాలకు ఉత్తమ విద్య అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఇవి బలమైన పునాది వేస్తాయని విద్యావేత్తలు భావిస్తున్నారు.

ఐదు రోజుల పర్యటన

విదేశీ పర్యటన మొత్తం ఐదు రోజులపాటు కొనసాగనుంది. ప్రతి బ్యాచ్‌లో 40 మంది ఉపాధ్యాయులు పాల్గొంటారు. మొత్తం నాలుగు బ్యాచ్‌లు ఈ పర్యటనకు వెళతాయి. అంటే 160 మంది ఉపాధ్యాయులు ఈ అరుదైన అవకాశాన్ని పొందనున్నారు.

ఎంపిక ఇలా

ఉపాధ్యాయుల ఎంపికను కలెక్టర్, విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించనున్నారు. ప్రతి జిల్లాలో మూడు కేడర్ల నుంచి ఒక్కో ఉపాధ్యాయుడిని ఎంపిక చేస్తారు. ఎస్జీటీ/ఎల్‌పీ/పీఈటీ/టీజీటీ లేదా తత్సమాన కేడర్ నుంచి ఒకరు, ఎస్‌ఏ/పీజీటీ లేదా తత్సమాన కేడర్ నుంచి ఒకరు, జీహెచ్‌ఎం లేదా ప్రిన్సిపాల్ కేడర్ నుంచి ఒకరిని ఎంపిక చేస్తారు. కనీసం పది సంవత్సరాల సేవ పూర్తిచేసి ఉండాలి. 55 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారికి మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ మేరకు ఈ నెల 23వ తేదీలోపు ఉత్తమ ఉపాధ్యాయుల జబితాను కలెక్టర్లకు పంపాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

పర్యటన ప్రాంతాలు

ఈ పర్యటనలు సింగపూర్, ఫిన్లాండ్, వియత్నాం, జపాన్ దేశాల్లో జరగనున్నాయి. వీటిలో విద్యావిధానం, పాఠశాల బోధన పద్ధతులు, విద్యార్థి-ఉపాధ్యాయ సంబంధాలు, సాంకేతిక వినియోగం వంటి అంశాలను ప్రత్యక్షంగా అధ్యయనం చేయనున్నారు. పర్యటన అనంతరం ఉపాధ్యాయులు తమ అనుభవాలను పంచుకుని, రాష్ట్రంలోని పాఠశాలల్లో అమలు చేయగల కొత్త బోధన విధానాలపై మార్గదర్శకాలు రూపొందించనున్నారు.

దీనిపై సమాచారం లేదు

ఉపాధ్యాయుల విదేశీ పర్యటనకు సంబంధించి విద్యాశాఖ మాత్యులు నారా లోకేశ్ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సమాచారం. అయితే దీనిపై మాకు ఎటువంటి ఆదేశాలు ఇంతవరకు రాలేదు. ఈ పర్యటనకు ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేస్తారని అంటున్నారు. జోన్ వారీగా పరిశీలిస్తే రాయలసీమ జిల్లాల నుంచి 40 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు విదేశీ పర్యటన అవకాశం లభిస్తుంది.



- డాక్టర్ షంషుద్దీన్, డీఈఓ

చంద్రానాయక్ కేసులో విచారణాధికారి నియామకం

- అనంతపురం జేడీగా తుఫాను సహాయ నిధుల్లో గోల్‌మాల్
- ప్రస్తుతం కడప జేడీగా చంద్రానాయక్ విధులు

కలికిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రానాయక్‌పై నమోదైన నిధుల దుర్వినియోగం కేసును పూర్తిస్థాయిలో విచారణ కోసం ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఆయన అనంతపురం జేడీగా పనిచేసే కాలంలో తఫాను సహాయ నిధుల్లో అక్రమాలకు పాల్పడిన విషయంలో సంజాయిషీ కోరుతూ అన్నమయ్య డీఏవోగా ఉండగా గత ఏడాది సెప్టెంబరు 23న సంజాయిషీ నోటీసులు జారీఅయ్యాయి. ఆయన సంజాయిషీలు సంతృప్తికరంగా లేకపోవడంతో విచారణకు ఆదేశించారు. ఈ అక్రమాలకు సంబంధించి అభియోగాలు నమోదయిన చంద్రానాయక్‌తో పాటు ఉరవకొండ ఏడీఏ ఎస్.పద్మజ, ప్రస్తుతం అనంతపురం ఏడీఏ కార్యాలయంలో పనిచేస్తున్న విడపనకల్ మండల వ్యవసాయాధికారిణి ఆర్.మధుమతి, డోనెకల్ వీఏఏ విజయభాస్కర్‌పై కూడా విచారణ జరపనున్నారు. గుంటూరు వ్యవసాయ శాఖ డైరెక్టరు కార్యాలయంలో అడిషనల్ డైరెక్టరుగా పనిచేస్తున్న వి.వి.విజయలక్ష్మిని విచారణాధికారిగా, ఆమెకు సహాయకారిగా అనంతపురం డీఏవో కార్యాలయం జేడీ యు.ఉమామహేశ్వరమ్మను నియమించారు. నెల రోజుల్లోగా విచారణ పూర్తిచేసి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది.



ఇవీ అభియోగాలు..

అనంతపురం జిల్లా విడపనకల్ మండలం డోనెకల్ గ్రామంలో 2021 ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు అధిక వర్షాల కారణంగా తీవ్రనష్టం వాటిల్లింది. రైతులకు పరిహారంగా పంపిణీ చేసిన నిధుల్లో రూ.1,52,02,812లు అనర్హులకు అందజేశారని లోకాయుక్తకు ఫిర్యాదు అందింది. దీనిపై ఈ-క్రాప్ నమోదుచేసే ప్రక్రియకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ రూపొందించిన వెండర్‌కు జాబితాను ఇచ్చి తప్పిదాలను నిగ్గుదేల్చాలని చెప్పారు. వీఏఏ విజయభాస్కర్ సరైన ఫార్మాట్‌లో ఈ-క్రాప్ వివరాలు నమోదు చేయని కారణంగా ఇందులో తప్పిదాలను గుర్తించేందుకు సాధ్యం కావడం లేదని సాఫ్ట్‌వేర్ వెండర్ తేల్చారు. అయితే వెబ్‌ల్యాండ్, మీ భూమి రికార్డులతో పోల్చి కనీసం రూ.10,39,085లు కచ్చితంగా దుర్వినియోగమైందని అధికారులు నివేదిక ఇచ్చారు. ఎలాంటి సాగుకు నోచుకోని భూములతోపాటు వామిదొడ్డి, ఇంటి స్థలాల సర్వే నంబర్లకు పరిహారం చెల్లించినట్లు గుర్తించారు. ఈ-క్రాప్ నమోదు స్థాయిలోనే అక్రమాలు చోటుచేసుకుని అనర్హులు లబ్ధి పొందినట్లు తేల్చారు. నిబంధనల ప్రకారం వీఏఏ నమోదు చేసిన ఈ-క్రాప్‌లో మండల వ్యవసాయాధికారి 20 శాతం, ఏడీఏ 20 శాతం, జాయింట్ డైరెక్టరు 5 శాతం నమోదును పరిశీలించి ధ్రువీకరించాల్సి ఉంది. ఈ పరిశీలనలో వీరంతా విఫలం కావడంతోనే నిధుల దుర్వినియోగానికి ఆస్కారం ఏర్పడిందని భావించి వీరందరిపై అభియోగాలు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ-క్రాప్ వివరాలను క్షేత్రస్థాయిలో లోతుగా విశ్లేషించి అక్రమాలను నిగ్గుతేల్చడానికి విచారణ కోసం ఉన్నతాధికారులను నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఆదేశాలు జారీచేశారు.

వైసీపీ పాలకపక్షం పాపం..!

- స్వపక్షంలోనే విపక్షం.. అజెండా అంశాల రద్దు
- వరుస వాయిదాలతో ప్రజల బేజారు
- ముందుకు సాగని పనులు ● ముంచుకొస్తున్న ఎన్నికల గడువు

పట్టణాభివృద్ధికి ఆటంకం..

మదనపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పాలకవర్గం గడువు ఇక ఆరునెలల్లో ముగియనుంది. ఈ నాలుగున్నరేళ్ల వెనక్కి చూసుకుంటే, పట్టణంలో ఎక్కడా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని పాలకవర్గంలోని వైసీపీ కౌన్సిలర్లే బాహాటంగా చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంలో నిధులు పుష్కలంగా ఉన్నా.. వాటినీ వినియోగించుకోవడంలో పాలకవర్గం విఫలమవుతోంది. స్వపక్షంలోనే విపక్షంలా రెండువర్గాలుగా విడిపోయి అటు అధికారులు, ఇటు తటస్థ కౌన్సిలర్లకు తలనొప్పిగా మారింది. కూటమి ప్రభుత్వ పాలనలో మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ తమను సంప్రదించకుండా స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల చెప్పినట్లు నడుచుకుంటున్నారని ఓ వర్గం ఆరోపిస్తోంది. ఈ క్రమంలో అప్పటివరకూ కొన్ని సమావేశాలు సవ్యంగా సాగినా... తర్వాత అడ్డంకులు, అవరోధాల మధ్య కౌన్సిల్ సమవేశాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో అజెండాలోని కొన్ని అంశాలు ఆమోదం పొందగా, మరికొన్ని పెండింగ్ పడుతుండగా, ఇంకొన్ని ఏకంగా రద్దుకు గురవుతున్నాయి.

ఇటీవల జరిగిన రెండు సమావేశాలను తీసుకుంటే అజెండాలోని కొన్ని అంశాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పక్కన పెట్టేయగా, సెప్టెంబరు సమావేశంలోని అజెండాను పూర్తిగా వాయిదా వేశారు. ఇలా ఒకరికి మించి మరొకరు పంతాలు, పట్టింపులకు పోతూ అభివృద్ధి పనులు ఆగిపోవడానికి కారణమవుతున్నారు. అది సాధారణ సమావేశమైనా.. అత్యవసర సమావేశమైనా.. మున్సిపల్ పాలకవర్గం తీరు మాత్రం అంతే. మున్సిపల్ పాలకవర్గంలో ఒక టీడీపీ కౌన్సిలర్ మినహా మెజారిటీ స్థానం వారిదే. అయితే ఇరుపోటీల మధ్య ఇల్లు చెడా.. పైపోటీల మధ్య పల్లె చెడే అనే సామెతను గుర్తు చేస్తూ, అందులోని రెండువర్గాల వ్యవహార శైలి అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారనే



మదనపల్లె మున్సిపల్ కార్యాలయం

విమర్శలకు తావిస్తోంది. గత నాలుగేళ్ల వైసీపీ పాలనలో ప్రజలే కాదు.. మున్సిపల్ పాలకవర్గం కూడా విసిగి వేసారి పోయింది. మున్సిపాలిటీలో అధికారం కౌన్సిల్‌దే అయినా.. స్థానిక ప్రజాప్రతినిధి జోక్యంతో అటు కౌన్సిలర్లు, ఇటు చైర్‌పర్సన్ కూడా నామమాత్రంగా మారారు. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపల్ పాలకవర్గంలోని కొందరు వైసీపీ కౌన్సిలర్లకు.. పట్టణాభివృద్ధిపై ఆశలు చిగురించాయి. ఇక పాలకవర్గానికి పూర్తిస్థాయిలో పట్టు ఉంటుందని, ఇక మిగిలిన ఏడాదిన్నరలోనైనా అభివృద్ధిని పరుగులు పెట్టించాలని భావించారు. అయితే వారు అనుకున్నట్లు ఆరునెలలు మాత్రమే పరిపాలన సవ్యంగా సాగగా, తర్వాత మళ్లీ మొదటికొచ్చినట్లయింది. వార్డులో అధికారం తమదే అయినా.. కౌన్సిలర్లకు ఏమాత్రం విలువ లేకుండా కూటమి నాయకులు వార్డుల్లో తమకు సమాంతరంగా ఇన్‌చార్జులను నియమించారని వాదన మొదలైంది. ఇక అధికారం కూటమిదే అయితే కౌన్సిల్ అజెండాలోని అంశాలనూ వారినే ఆమోదించుకోవాలని, తమతో పనేంటని వైసీపీ నిలదీస్తోంది. ఈ క్రమంలో చైర్‌పర్సన్ సిద్ధం చేసిన అజెండాలోని కొన్ని అంశాలను పక్కన పెట్టడం, తిరస్కరించడం మొదలు పెట్టారు. అక్కడి నుంచి మొదలైన వివాదం.. ఇప్పటి వరకూ కొనసాగుతూనే వుంది. తమ ప్రమేయం లేకుండా, తమను సంప్రదించకుండా వార్డుల్లో పనులు ఎంపిక చేశారని, అజెండాలో పెట్టారని కొందరు కౌన్సిలర్లు ఆక్షేపించారు.

ఈ అంశాలను పక్కన పెడితే, ఆగస్టు, సెప్టెంబరులో జరిగిన సాధారణ, అత్యవసర సమావేశాలు ఏమాత్రం ఫలితం ఇవ్వలేదు. ఇందులో ఒక సమావేశంలో అజెండా అంశాలను పక్కన పెట్టగా, మరో సమావేశంలో అజెండానే వాయిదా వేసేశారు. ఈ క్రమంలో పట్టణంలో ప్రధానమైన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలకు అడ్డుకట్ట పడింది. గత ప్రభుత్వంలో బిల్లులు సక్రమంగా రాగా, కాంట్రాక్టర్లు పనులు నిలిపేశారు. దీంతో తమ వార్డులో ఒక్క పనిచేయలేదని, చివరి రోజుల్లోనైనా కనీసం రోడ్డు, కాలువలు నిర్మిద్దామంటే, ఇలా పనులు అడ్డుకోవడం ఏంటని కొందరు కౌన్సిలర్లు మౌనంగా రోధిస్తున్నారు.

ప్రధాన సమస్యలు.. ఆగిన పనులు

వర్షాకాలంలో ప్రశాంత్‌నగర్, ఎ.వి.నాయుడు కాలనీ, సప్తగిరినగర్‌లను ముంచెత్తుతున్న వరద నీటిని దారి మళ్లించేందుకు రూ.1.75 కోట్లతో డ్రైనేజీ నిర్మాణానికి కౌన్సిల్ పరిపాలనా ఆమోదం తెలిపింది. తర్వాత టెండర్ దశ పూర్తయి పనులు ప్రారంభం కాగా, వివిధ కారణాలతో ఈ అంశాన్ని పక్కన పెట్టేయగా, పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఈ సమస్యను పరిష్కరించాలని ప్రశాంత్‌నగర్ వాసులు కొన్నేళ్లుగా కోరుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని కదిరిరోడ్డు వెంబడి మార్కెట్‌యార్డు నుంచి ప్రశాంత్‌నగర్ మెయిన్ లైన్ వరకూ కాలువ నిర్మాణాన్ని ఓ వర్గం అడ్డుకోగా బ్రేక్ పడింది.

- నక్కలదిన్నెలో అమృత్ పథకం కింద రూ.1.30 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంకు మంజూరైంది. గతంలో ప్రాథమికంగా వేసిన అంచనా, సాంకేతిక పరంగా మరో రూ.30 లక్షలు అవసరమని గుర్తించారు. ఇందుకు మున్సిపల్ సాధారణ నిధులు వెచ్చించాలని ప్రతిపాదించగా కౌన్సిలర్లు అడ్డుకున్నారు. ట్యాంకు నిర్మాణానికి ముందు ప్రతిపాదించినట్లే అమృత్ నిధులతోనే చేపట్టాలని, సాధారణ నిధులు కేటాయించవద్దని కొందరు ఆక్షేపించారు. అది ఇప్పటికిప్పుడు సాధ్యం కాకపోవడంతో చివరకు ఆ పనులే రద్దయ్యే పరిస్థితి ఏర్పడింది.
- మున్సిపాలిటీలోని లబ్ధిదారులకు పట్టణ శివారులో టిడ్కో ఇళ్లు నిర్మించారు. 1872 మందికి ప్లాట్లు కేటాయించారు. వీరిలో చాలామంది ఇప్పటికే అక్కడ నివాసం ఉంటున్నారు. ఎమ్మెల్యే పర్యటనలో భాగంగా అక్కడి స్థానికులు వీధిలైట్లు వేయాలని విన్నవించారు. దీంతో రూ.11లక్షల వ్యయంతో వీధిలైట్లు ఏర్పాటుకు అజెండాలో అంశాన్ని చేర్చారు. దీన్ని కౌన్సిల్ వ్యతిరేకించింది.

మండలంలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన


రైతు భూ సమస్య గురించి వింటున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఓబులవారిపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు. దీంతో జిల్లా, మండల స్థాయి అధికారులు పరుగులు పెట్టారు. ఉదయం 11.10 గంటలకు చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీలోని కస్తూర్బాగాంధీ విద్యాలయానికి చేరుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ కలెక్టర్‌కు స్వాగతం పలికారు. అనంతరం వారు విద్యాలయంలో తరగతి గదులు, వంటగదులు, బాత్‌రూములను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న కళాశాల భవనాలను పరిశీలించారు. అనంతరం బొమ్మవరం గ్రామ పంచాయతీలోని చప్పిడి రమేష్ బాబు, కేవీ ప్రసాద్, కె.వెంకటేష్, వాసు, ఎరికలయ్య రైతుల సాగులో ఉన్న ఉద్యానవన పంటలను జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ సుభాషిని, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు మండలాల హార్టికల్చర్ ఆఫీసర్ భాస్కర్‌ల ఆధ్వర్యంలో పరిశీలించారు. ముందుగా మామిడి, అరటి, బొప్పాయి, నన్నారి పంటల సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా రైతు తిరుపయ్యనాయుడు తమ భూసమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు యామిని, ఆర్ఐ మల్లికార్జునరెడ్డి, ఎస్ఐ మహేష్, డీఈవో డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎల్.నాగయ్య, జీసీడీవో సుమతి, ప్రిన్సిపల్ రాజకుమారి, మండల విద్యాశాఖాధికారులు శివరామిరెడ్డి, రెడ్డెయ్య, టీడీపీ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, బి.కమ్మపల్లె టీడీపీ నాయకులు రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

- రాష్ట్ర స్థాయిలో రెండు బంగారు పతకాలు

రైల్వేకోడూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో జాతీయ స్థాయి పోటీలకు రైల్వేకోడూరు ప్రభుత్వ బాలికల హైస్కూల్ విద్యార్థులు కె.సంధ్యన, కె.నవ్య ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామయ్య మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 10, 11, 12 తేదీల్లో బాపట్ల జిల్లా పెట్టూరు మండలంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో వీరు పాల్గొని బంగారు పతకాలు సాధించారని తెలిపారు. అంతేకాక నవంబరులో పంజాబ్‌లో జరగబోవు జాతీయ స్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారని, రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీరామ అనే విద్యార్థి కాంస్య పతకాన్ని సాధించినట్లు వివరించారు. కాగా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు, కోచ్ శివాజీ అభినందించారు.


పతకాలు సాధించిన విద్యార్థులు

వడ్డీ వ్యాపారుల ఇంటిముందు హిజ్రా ధర్నా

- డబ్బు, బంగారు తీసుకుని మోసం చేశారంటూ ఆరోపణ

మదనపల్లెటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారుల ఇంటి ముందు ఓ హిజ్రా ధర్నా చేసిన విషయం మంగళవారం చోటు చేసుకుంది. డబ్బు, బంగారు తీసుకోవడమే కాకుండా తనపై దాడికి దిగారని ఆరోపిస్తున్నారు. బాధితురాలి కథనం మేరకు... పట్టణంలోని గౌతమినగర్‌కు చెందిన స్వాతి (హిజ్రా) అనే తాను చీటీల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నానని, ఈ క్రమంలో తన స్నేహితురాలు చంద్రకళకు వడ్డీ వ్యాపారులు ఈశ్వర్, స్వర్ణలత వద్ద పూచీ పడి రూ.30 లక్షల వరకు అప్పు ఇప్పించానని తెలిపారు. అనంతరం తన స్నేహితురాలు ఐపీ పెట్టి వెళ్లిపోవడంతో పూచీ ఉన్న కారణంగా వడ్డీ వ్యాపారులు తనను నిలదీశారన్నారు. చేసేది లేక 2021 సంవత్సరం నుంచి వారికి ఫోన్‌పే ద్వారా నాలుగేళ్ల పాటు రూ.34 లక్షలు చెల్లించడంతో పాటు, వారి అకౌంటుకు రూ.8లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశానని ఆరోపించారు. ఇవే కాకుండా 600 గ్రాముల బంగారు, ఇంటి దస్తావేజులు కూడా వడ్డీ వ్యాపారులు తీసుకున్నారని, వాటిని తిరిగి ఇవ్వాలని కోరినా ఇవ్వడం లేదని తెలిపారు. కాగా మంగళవారం వడ్డీ వ్యాపారుల ఇంటి ముందు బాధితు లలో కలిసి ధర్నాకు దిగినట్లు తెలి పారు. ఇదిలా ఉండగా.. ఈ విషయమై తాను గత నెలలోనే టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, పోలీసులు తనకు న్యాయం చేయాలని కోరారు.


వడ్డీవ్యాపారుల ఇంటి ముందు ధర్నా చేస్తున్న స్వాతి, బాధితులు

పాత జీఎస్టీతో అమ్మితే ఫిర్యాదు చేయండి

- డ్వామా పీడీ వెంకటరత్నం



ర్యాలీ నిర్వహిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

ములకలచెరువు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పాత జీఎస్టీతో ఎక్కడైనా వస్తువులు, సరుకులు ఇతర వస్తువులు విక్రయిస్తే టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని డ్వామా పీడీ వెంకటరత్నం అన్నారు. స్థానిక సీఎల్ఆర్సీ భవనంలో మంగళవారం ఎన్డీఏ ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై తంబళ్లపల్లె నియోజకవర్గ స్థాయిలో ప్రజలు, మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో ఒక్కో కుటుంబానికి దాదాపు రూ.15 వేలు ఆర్థిక లబ్ధి చేకూరుతోందన్నారు. అనంతరం సీఎల్ఆర్సీ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చెన్నక్రిష్ణా, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

కలకడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పోతువారిపల్లెలో భార్యభర్తలపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. పోతువారిపల్లె వాసైన నాగయ్య అదే గ్రామానికి చెందిన భాగ్యమ్మకు పాత కక్షలున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇంటి వద్ద ఉన్న నాగయ్య, అతని భార్య రెడ్డెమ్మపై భాగ్యమ్మ, కుమారుడు కిశోర్ దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి

పుల్లంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనంత సముద్రం పంచాయతీ పాపక్కగారిపల్లె గ్రామంలో మంగళవారం సాయంత్రం విద్యుత్ శాఖకు గురై రైతు చిన్నిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి(48) మృతిచెందాడు. వ్యవసాయ పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వస్తుండగా మోటారు పనిచేస్తుందో లేదోనని చెక్ చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. విషయం తెలుసుకున్న గ్రామ ప్రజలు చంద్రమోహన్‌రెడ్డిని ఓ ప్రైవేటు వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు ప్రభుత్వ వైద్యులు నిర్ధారించారు. ఆయన సతీమణి లక్ష్మీదేవి జీవనోపాధికై ఇటీవల కువైత్‌కు వెళ్లింది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పిల్లలు చిన్నవారు కావడంతో కుటుంబ పోషణ ఎలా అని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుల్లంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


చంద్రమోహన్‌రెడ్డి(ఫైల్)

యువకుడు ఆత్మహత్యాయత్నం

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక బాధలతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నిమ్మనపల్లెలో చోటు చేసుకుంది. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసుల వివరాల మేరకు.. నిమ్మనపల్లె మండలం, ముష్టూరు గ్రామం, ఎర్రప్పగారిపల్లెకు చెందిన శంకర కుమారుడు సత్యనారాయణ (30) బెంగళూరులో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ మంగళవారం ఉదయం గ్రామానికి వచ్చారు. ఇంతలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన యువకున్ని కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు నిమ్మ నపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


చికిత్స పొందుతున్న యువకుడు

పురుగుల మందు తాగి యువతి...


చికిత్స పొందుతున్న యువతి

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): భర్త మందలించాడనే కారణంతో పురుగుల మందు తాగి భార్య ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, మోతీనగర్, రెడ్డెమ్మ పిండిమిషన్ వద్ద కాపురం ఉన్న షేక్ వసీం భార్య హినాక్ కౌసిర్ (27) భర్త మందలించాడని మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స చేసిన డాక్టర్లు మెరుగైన వైద్యం నిమిత్తం తిరుపతికి రెఫర్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అపస్మారక స్థితిలోకి మహిళ

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కుటుంబ కలహాల నేపథ్యంలో మదనపల్లె మండలం, మాలేపాడు పంచాయతీకి చెందిన భీమేశ్వర భార్య శారద (30) మంగళవారం ఇంట్లో పురుగుల మందు తాగేసింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను భర్త గమనించి వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ప్రజాసంఘాల నాయకులు

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఓ పేద కుటుంబంపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మదనపల్లెలోని జైభీమ్ భారత్ పార్టీ జిల్లా నాయకుడు కోన భాస్కర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏఐటీయూసీ తంబళ్లపల్లె నియోజకవర్గ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి సలీంబాషలు స్థానిక పోలీసుస్టేషన్ వద్ద వారు మాట్లాడారు. రాపూరివాండ్లపల్లె పంచాయతీ నాగన్నకోటకు చెందిన గండికోట చిన్నప్ప కుమారుడు వెంకటేష్ లారీ డ్రైవర్‌గా ఉంటూ తమ కుటుంబాన్ని పోషించుకునేవాడన్నారు. ఇదే క్రమంలో ఈ నెల 8న వెంకటేష్ తన వృత్తి రీత్యా వెళ్లాడని, ఈ నేపథ్యంలో సదరు గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న మల్లిఖార్జున కుమారులు ఇంట్లో నిద్రిస్తున్న మహిళను తలుపు తట్టి నిద్ర లేపారు. తెలిసిన వారు కావడంతో ఆ మహిళ తలుపు తీసింది. వారు మంచినీళ్లు కావాలని కోరడంతో పాటు ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించారని తెలిపారు. దీంతో ఆ మహిళ మరుసటి రోజు ఇంటికి వచ్చిన తన భర్తకు జరిగిన విషయాన్ని చెప్పడంతో వెంకటేష్ ఆ ఇద్దరు యువకులను నిలదీశాడు. దీంతో ఆ యువకులు ఆవేశంతో ఊగిపోయి వెంకటేష్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. స్థానికులు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించి అక్కడి చికిత్సలు అందిస్తున్నారని తెలిపారు. కాగా ఇదే విషయమై వెంకటేష్ భార్య సరస్వతి ఫిర్యాదు మేరకు పీటీఎం పోలీసులు కేసు నమోదు చేశారే కానీ వారిని అరెస్టు చేయకుండా కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని ప్రజాసంఘాలు ఆరోపించాయి. ఎస్ఐ అందుబాటులో లేకపోవడంతో విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్‌తో ప్రజాసంఘాల నాయకులు మాట్లాడారు. దాడి చేసిన వారిని పోలీస్‌స్టేషన్‌లో ఉంచాలని వారు డిమాండ్ చేశారు.


పోలీసులతో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

వ్యాపారిపై టీడీపీ నేత దాడి

- చంపేస్తానంటూ బెదిరింపులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో వ్యాపారిని టీడీపీ నాయకులు చితకబాదిన సంఘటన పట్టణంలోని చిప్పిలి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, సురబికాలనీకి చెందిన మోహన్ మురళి హంద్రీనీవా కాలువ సమీపంలో 1997లో రైతు నుంచి 19 సెంట్లు స్థలాన్ని కోనుగోలు చేశాడు. ఇటీవల తన పొలం పక్కనే మదనపల్లెకు చెందిన టీడీపీ నాయకులు, మున్సిపల్ మాజీ చైర్మన్ కొడవలి శివప్రసాద్ కొంత భూమిని కోనుగోలు చేసి మోహన్ మురళికి చెందిన భూమిని అక్రమించడానికి ప్రయత్నం చేశారు. దీంతో పలుమార్లు ఘర్షణ పడ్డారు. తన రికార్డులు పక్కాగా ఉన్నాయని ఎంతచెప్పినా వారు వినిపించుకోలేదు. కాగా మోహన్ మురళి తన పొలంలో పనులు చేసుకొంటూ ఉండగా అక్కడికి చేరుకున్న కొడవలి శివప్రసాద్, అతని తమ్ముడు కరుణాకర్, తమ డ్రైవర్‌తో కలిసి మోహన్ మురళిపై దాడి చేసి పిడుగుద్దులు గుద్ది చితకబాదారు. మరోసారి పొలంలోకి వస్తే చంపేస్తామంటూ బెదిరించారు. తాను హార్ట్ పేషెంటు అంటున్నా వినకుండా దాడి చేసినట్లు బాధితుడు వివరించారు. స్థానికులు అడ్డుకుని వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు మదనపల్లె తాలుకా పోలీసులు కేసును విచారిస్తున్నట్లు చెప్పారు.


చికిత్స పొందుతున్న వ్యాపారి

కోడిపందేలపై విస్తృత దాడులు

వాల్మీకిపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఎస్పీ ధీరజ్ కనుబిల్లి ఆదేశాల మేరకు వాయల్పాడు మండలంలోని గండబోయనపల్లె గ్రామ పంచాయతీ మేకలవారిపల్లె అటవీ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం కోడి పందేలపై పోలీసులు డ్రోన్ కెమెరాలతో విస్తృత దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కోడి పందెం నిర్వహిస్తున్న ప్రాంతంలో 15మందిని అదుపులోకి తీసుకుని 18 ద్విచక్రవాహనాలు, నగదు రూ.24,200 స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్, వాల్మీకిపురం, నిమ్మనపల్లె, కలికిరి, కలకడ, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది, జిల్లా ఎస్టీఎఫ్ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.


డ్రోన్ కెమెరాల దాడిలో పట్టుబడిన కోడిపందెం రాయుళ్లు

ఇరువర్గాల ఘర్షణ - కేసు నమోదు

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం, చీకలబైలు అడవిలో దర్గా నిర్మాణ విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. సోమవారం రాత్రి జెండాలు నాటుతుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. అటవీశాఖాధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చీకిలబైలు గ్రామంలో అదే గ్రామానికి చెందిన కొందరి సహకారంతో అడవిలో స్థలం కబ్జా చేసి మదనపల్లెలోని కొందరు దర్గా నిర్మాణానికి సన్నాహాలు చేసి ముస్లిం జెండాలు నాటారు. అటవీశాఖాధికారిణి ఏబీవో ఉమా దర్గా నిర్మాణాన్ని అడ్డుకున్నారు. గ్రామస్థులు రోడ్డుపై దర్గా నిర్మించరాదని నిరసన చేపట్టారు. దీంతో వివాదం తారాస్థాయికి చేరింది. ఏబీవో ఉమా ఫిర్యాదు మేరకు మదనపల్లె తాలుకా పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

రుషివాటిక ఘటనపై విచారణ


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి లక్ష్మీనరసయ్య

బి.కొత్తకోట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టు పంచాయతీ గట్లపై నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలో గత నెల 7న జరిగిన ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి లక్ష్మీనరసయ్య మంగళవారం విచారణ చేపట్టారు. ఈ ఘటనలో పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న లక్కిరెడ్డిపల్లి మండలం కాలాడివాండ్లపల్లెకు చెందిన విద్యార్థి శేషాద్రిరెడ్డి కంటికి తీవ్రగాయమై కనుచూపు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ విషయమై బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో తమకు న్యాయం చేయాలంటూ బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. పోలీసులు పాఠశాలలో, బాధిత విద్యార్థి నివాసంలో విచారణ చేపట్టారు. బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఈ ఘటనపై స్పందించారు. ఘటనపై సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలంటూ వివిధ శాఖల అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం. జిల్లా వైద్యాధికారి లక్ష్మీనరసయ్య సంబంధిత పాఠశాలకు వెళ్లారు. కనుచూపు కోల్పోయిన విద్యార్థి శేషాద్రిరెడ్డి తోటి విద్యార్థులను, పాఠశాల సిబ్బందిని విచారించారు. తమ విచారణలో తెలిసిన వివరాలను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది డా.శ్రీధర్, ప్రభాకర్, విజయలక్ష్మి, రెడెమ్మ, ప్రమీల పాల్గొన్నారు.

పసుపు పంటకు.. తెగుళ్లు



- అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి ● సకాలంలో మందులు పిచికారి చేయాలి
- జాగ్రత్తలు పాటించకపోతే పంటంతా నాశనం ● హార్టికల్చర్ అధికారుల హెచ్చరికలు

మైదుకూరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో పసుపు పంటకు ఆకుమచ్చ తెగుళ్లు ఆశిస్తాయని.. రైతులు అప్రమత్తంగా ఉండి పలు జాగ్రత్తలు తీసుకోవాలని హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు. వారి వివరాల మేరకు... మైదుకూరు నియోజకవర్గంలో ప్రధాన వాణిజ్య పంట పసుపు పంట. ఈ ఏడాది మైదుకూరు మండలంలో సుమారు 1120 ఎకరాలు, దువ్వూరులో 700 ఎకరాలు, ఖాజీపేటలో 527 ఎకరాలు, చాపాడులో 331 ఎకరాలలో రైతులు పసుపు పంటను సాగు చేశారు.

వర్షాకాలంలో పసుపు పంటలో ముఖ్యంగా ఆకుమచ్చ, తాటాకు తెగుళ్ల ఆశిస్తాయని చెబుతున్నారు. ఈ తెగుళ్ల సోకినపుడు పసుపు పంటలో ఆకులకు మచ్చలు ఏర్పడతాయని... పట్టించుకోక పోతే పంట పూర్తిగా నాశనం అయ్యే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. దీని నివారణకు ఎకరాకు కార్బెండజిమ్ ఒక గ్రాము లేదా మ్యాంకోజేబ్ 3 గ్రాములు లేదా ప్రొపికాన్‌జోల్ ఒక ఎంఎల్ లేదా డైపెన్కొన్‌జల్ ఒక ఎంఎల్ లీటరు నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు మార్చి మార్చి పిచికారి చేయాలని సూచిస్తున్నారు. అంతేకాకుండా వర్షాలు తగ్గిన వెంటనే రెండు లేదా మూడు సార్లు పొటాషియం నైట్రేట్ 13-0-45 5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 5 గ్రాములు లీటరు నీటితో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలని తెలిపారు.



హార్టికల్చర్ ఆఫీసర్ రామక్రిష్ణ

అధికారుల సూచనల మేరకే...

పసుపు పంటను పండించే రైతులు వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి. పసుపు పంటకు ముఖ్యంగా ఆకుమచ్చ, తాటాకు తెగుళ్ల వ్యాపిస్తాయి. రైతులు ఏవైనా సందేహాలు ఉంటే మమ్మల్ని సంప్రదించవచ్చు. అధికారుల సూచనల మేరకు మాత్రమే పురుగు మందులను వాడాలి. ఎక్కువ మోతాదులో పిచికారి చేస్తే పంటలు నాశనం అవుతాయి.

- రామక్రిష్ణ, హార్టికల్చర్ అధికారి

రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి : జేడీ

కొండాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్య మైన విత్తనాలు సరఫరా చేయాలని జిల్లా సంయుక్త వ్యవ సాయ సంచాలకులు (జేడీఏ) బి.చంద్రనాయక్ డీలర్లను ఆదేశించారు. కొండాపురంలోని విత్తన సరఫరా గోడౌన్‌లను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా గోడౌ న్‌లలో శనగ విత్తనాల నాణ్యతను పరిశీలించి, రికార్డుల ను తనిఖీ చేశారు. రాబోయే రబీ సీజన్‌కు రైతులకు అవసరమైన విత్తనాలను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలని మిల్లు యజమానులను ఆదేశించారు. రెండు, మూడు రోజుల్లో శనగ విత్తనాల సరఫరా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ నెల 25లోపు రైతు సేవా కేంద్రంలో రైతులు పంట నమోదు చేయించు కోవాలని తెలిపారు. బీడు భూములకు కూడా పంట నమోదు తప్పనిసరిగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా లావనూరు గ్రామంలో సాగుచేసిన శనగ పంటను, ఈ క్రాప్ నమోదును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ రామమోహన్‌రెడ్డి, ఏవో రామాంజులరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



గోడౌన్‌లో శనగ విత్తనాల నాణ్యతను పరిశీలిస్తున్న జేడీఏ

పంచాయతీ ఆదాయ వనరులను సమీకరించాలి

కడప రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ పరిధిలో ఆదాయ వనరులను సమీకరించుకొని తద్వారా పల్లెసీమల ప్రగతికి బాటలు వేయాలని పంచాయతీశాఖ జిల్లా అధికారి (డీపీవో) రాజ్యలక్ష్మి, జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యంలు పేర్కొన్నారు. మంగళవారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో గ్రామ పంచాయతీ సొంత ఆదాయ వనరుల సృష్టి అనే అంశంపై ఎంపీడీవోలకు, డిప్యూటీ ఎంపీడీవోలకు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పల్లెసీమల ప్రగతికి ప్రభుత్వం ప్రముఖ ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ పరిధిలోని వనరుల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకొని తద్వారా పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. సొంత భవనాలు, ఇంటిపన్ను, నీటి వినియోగపు చార్జీలు, వారాంతపు సంతలు, జీవాల సంతలు, జంతు వధశాలల నిర్వహణ, ట్రేడ్ లైసెన్సుల జారీ, పరిశ్రమలు, ఫ్యాక్టరీల ద్వారా పన్నులు తదితర వాటి ద్వారా ఆదాయాన్ని సమకూర్చి అభి వృద్ధి పనులను చేపట్టాలన్నారు. అలాగే గ్రా మ పంచాయతీల స్థిరమైన వనరుల సృష్టికోసం ఆదాయ అంచనా, ప్రణాళిక, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, నైపుణ్యాల ప్రాముఖ్యత తదితర వాటిని వివరించారు. ఇతర రాష్ట్రాలలో సొంత ఆదాయ వనరుల సమీకరణలో సాధించిన ప్రగతిని తెలియజేశారు. పంచాయతీలోని ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు.డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ రమణారెడ్డి, ట్రైనింగ్ మేనేజర్ సురేష్, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో రాజ్యలక్ష్మి

వాయు కాలుష్య నియంత్రణకు పటిష్ట చర్యలు : కలెక్టర్

కడప కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో వాయు కాలుష్య నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వాయు కాలుష్య నియంత్రణ అమలుపై సమావేశం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు దేశంలోని వాయుకాలు ష్యం కలిగిన 132 నగరాలలో కాలుష్య నియంత్రణకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. వాటిలో కడ ఎ నగరం ఒకటని, ఈ ప్రాంతంలో వాయు కాలుష్యం వ్యాపించడంపై మూల కారణాలు తెలుసుకొని, నియంత్రించేందుకు అవసరమైన కార్యాచరణ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలుష్య నియంత్రణకు నగరంలో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. వాహనాల ద్వారా కాలుష్యం వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో వాయు కాలుష్యం వ్యాప్తి చెందే ముఖ్యమైన ప్రాంతాలను గుర్తించి నియంత్రణకు చర్యలు తీసు కోవాలన్నారు. నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వాయు కాలుష్య నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నగరంలో వాయు కాలుష్య పర్యవేక్షణకు ఆరు ఆపరేటింగ్ స్టేషన్లు పనిచేస్తున్నాయన్నారు. అనంతరం కడప కాలుష్య నియంత్రణ బోర్డు ఆధ్వర్యంలో రూపొందించిన దివాలీ ఏకో ఫ్రెండ్లీ గిఫ్ట్ పోస్టర్స్‌ను కలెక్టర్ అధికారులతో కలసి ఆవిష్కరించారు, కార్యక్రమంలో నగర కమిషరు మనోజ్‌రెడ్డి, పర్యావరణ ఇంజనీరింగ్ అధికారి సుధా కురుభ, కార్పొరేషన్ ఎస్ఈ చెన్న కేశవరెడ్డి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరలు పాల్గొన్నారు.



వాయు కాలుష్య నియంత్రణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ఇబ్బందులు లేకుండా రీ సర్వే చేపట్టాలి



రాఘవాపురం గ్రామంలో భూముల రీసర్వేని పరిశీలిస్తున్న శ్రీనివాసులరెడ్డి

ముద్దనూరు/మైదుకూరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సెంట్రల్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ముద్దనూరు మండలంలోని కొత్తపల్లె, వేల్పుచర్ల గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న ఫేస్-3 భూముల రీసర్వేని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. వి.రాఘవాపురం గ్రామ పొలంలో చేపడతున్న రీసర్వేని పరిశీలించారు. రైతులకు రీసర్వేపై సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం కొత్తపల్లె గ్రామ సచివాలయంలో డివిజన్ పరిధిలోని మండల, గ్రామ సర్వేయర్లతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు ఇచ్చారు. అసిస్టెంట్ డైరెక్టర్ మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే పుల్లయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ కె.హరి, డీటీ వరదకిశోర్ రెడ్డి, సర్వేయర్లు పాల్గొన్నారు.

రైతులతో సమావేశం

మైదుకూరు మండలంలోని శివపురంలో జరుగుతున్న రీసర్వే పనులను సెంట్రల్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ పరిశీలించి రైతులతో నేరుగా విచారించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రీ సర్వేకు వస్తున్నాం అని ఒక రోజు ముందు మాత్రమే రెవెన్యూ అధికారులు నోటీసులు ఇస్తున్నారని ఫిర్యాదు చేశారు. రీసర్వేకి కొంత సమయం ఇవ్వాలని కోరారు. అనంతరం ఆయన రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

నేడు టపాసుల దుకాణాలకు లాటరీ

కడప కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా నగర పరిధిలో బాణా సంచా దుకాణాల ఏర్పాటుకు బుధవారం సాయంత్రం 6 గంటలకు కడప ఆర్డీవో కార్యాలయంలో లాటరీ పద్ధతిలో దుకాణాల కేటా యింపు చేస్తామని ఆర్డీవో జాన్ ఇర్విన్ తెలిపారు. బాణాసంచా దుకాణాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న నిర్వహకులందరూ పాల్గొనాలని ఆర్డీవో ప్రకటనలో కోరారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

కడప నాగరాజుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల కోసం ఈనెల 16వ తేదీ ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు విద్యుత్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యుత్ అదాలత్‌లో తిరుపతి ఏపీఎస్పీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ (విశ్రాంతన్యాయమూర్తి) హాజరవుతారన్నారు. దీర్ఘకలికంగా ఉన్న సమస్యలు, ప్రత్యేక అదాలత్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

కడప క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు చిన్నచౌక్ పోలీసుల తెలిపారు. సుబ్బరాయుడు అనే వృద్ధుడు అదే ప్రాంతానికి చెందిన ఎనిమిది సంవత్సరాల బాలిక ఇంటి వద్ద ఆడుకుంటుండగా ఇంట్లోకి పిలిచి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక భయపడి కేకలు వేయడంతో బంధువులు అక్కడికి వచ్చి రక్షించారు. ఈ మేరకు చిన్నచౌక్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

కులంపేరుతో దూషించిన వ్యక్తిపై..

కడప క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప నగరం శంకరాపురంలో విజయ్‌కుమార్ అనే వ్యక్తిపై దాడి చేయడంతో పాటు కులం పేరుతో దూషించిన ఒకరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు చిన్నచౌకు సీఐ ఓబులేసు తెలిపారు. సీఐ వివరాల మేరకు శంకరాపురానికి చెందిన విజయ్‌కుమార్ సమీపంలో ఉన్న అక్కిశెట్టి వెంకట్ మంగళవారం చిన్న విషయమై గొడవ పడ్డారు. దీంతో విజయ్‌కుమార్‌ను వెంకట్ కొట్టడంతో పాటు కులం పేరుతో దూషించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం కైవసం

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి 69వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో పోటీల్లో ప్రొద్దుటూరుకు చెందిన శ్యాంకార్తికేయ బంగారు పతకాన్ని కైవసం చేసుకుని మొదటిస్థానంలో నిలిచారు. ఈనెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు గుంటూరు సమీపంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించినట్లు తైక్వాండో కోచ్ రాజేష్ తెలిపారు. ఈ పోటీల్లో అండర్-21 వెయిట్ కేటగిరిలో 6వ తరగతి చదువుతున్న శ్యాం కార్తికేయ ప్రతిభను కనపరచి గోల్డ్‌మెడల్ కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. న్యాగల్యాండ్‌లో జాతీయస్థాయిలో జరుగబోయే నేషనల్ స్కూల్‌గేమ్స్‌కు ఎంపికైనట్లు తెలిపారు.



శ్యాం కార్తికేయను అభినందిస్తున్న దృశ్యం

సివిల్స్, గేట్ ఉచిత శిక్షణకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

వేంపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు యూపీఎస్సీ ద్వారా నిర్వహించే సివిల్స్ పరీక్ష, ఇంజనీరింగ్ ద్వారా నిర్వహించే గేట్ పరీక్ష ఉచిత శిక్షణకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌కు చెందిన కోనం ఫౌండేషన్ ద్వారా ఉచిత శిక్షణతో పాటు ఫెలోషిప్ అందిస్తారని డైరెక్టర్ తెలిపారు. ఇటీవల ఫౌండేషన్ ద్వారా ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఏస్ ఇంజనీరింగ్ విద్యాసంస్థ ద్వారా గేట్ పరీక్షకు ప్రవేశపరీక్ష నిర్వహించగా సివిల్స్‌కు సంబంధించి 9 మంది, గేట్ పరీక్షకు 20 మంది విద్యార్థులు ఎంపికయ్యారని డైరెక్టర్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఫౌండేషన్ ద్వారా ఉచిత శిక్షణతో పాటు ఫెలోషిప్ ఇస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఉన్నత ఉద్యో గ అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు.



ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామి గుప్త

ఎల్‌ఎల్‌బీ పరీక్షల తనిఖీ



పరిశీలిస్తున్న వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో జరుగుతున్న లా సెమిస్టర్ పరీక్షలను నూతన ఉపకులపతి ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ మంగళవారం తనిఖీ చేశారు. ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్ల గురించి చీఫ్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ జి.కాత్యాయని వివరించారు. ప్రస్తుత పరీక్షకు 503 మంది హాజరయ్యారని, 67 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వీసీ వెంటకంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావు ఉన్నారు. పరీక్షల విదుల్లో పరీక్షల అబ్జర్వర్ డాక్టర్ గణేష్‌నాయక్, సహాయ పరీక్షల అధికారులు డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్, డాక్టర్ మునికుమార్, సిబ్బంది, పి.చంద్రమౌళి పాల్గొన్నారు.

రాయలసీమ సమస్యలను ప్రస్తావించాలి

- కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి

వేంపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో జరిగే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి బహిరంగసభలో రాయల సీమ సమస్యల గురించి ప్రస్తావించాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్ర విభజన సమయంలో రాయలసీమకు అన్యాయం జరిగిందన్నారు. రాయలసీమకు హక్కుగా రావాల్సిన అన్నింటిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాయలసీమకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, కడపకు సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం, రాయల సీమ సమగ్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని నిధులు కేటా యించాలన్నారు. కడప, రాయచోటి, మదనపల్లె, బెంగళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైల్వే నిర్మాణాన్ని పూర్తి చేయించాలని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు.

రేపు గండి దేవస్థానంలో టెండర్లు

చక్రాయపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో ఈనెల 16వ తేదీ సాయంత్రం టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. దేవస్థానంలో శుభకార్యక్రమాలకు పందిళ్లు, ఎలక్ట్రికల్, పూల డెకరేషన్లు, సప్లయర్స్ సామాన్లు సరఫరా చేసే హక్కుకు రూ.50వేలు ధరావత్తు చెల్లించి టెండర్‌లో పాల్గొనవచ్చ న్నారు. స్వామివారి అలంకరణకు గ్రామోత్సవంలో పూలమాలలు సప్లై చేసే హక్కుకు రూ.20వేలు ధరవాత్తు, అన్న దానం, అరిటాకుల సప్లై చేసుకునేందుకు, మామిడి, అరటి తోరణాలు, స్వామివారికి వస్త్రాలు సరఫరా చేసే హక్కుకు రూ.10వేలు ధరావత్తు చెల్లించి పాల్గొనవచ్చన్నారు. అలాగే ప్లంబింగ్ సామాన్లు కోసం, స్టేషనరీ, ఎల క్ట్రికల్ సామాన్లు సరఫరా చేసే హక్కు కోసం రూ.10వేలు, ప్రింటింగ్ పార్సల్, ఖాళీ నెయ్యి డబ్బాలు విక్రయించేందుకు రూ.5వేలు, పాదరక్షకులు భద్రపరుచుటకు రూ.5వేలు, ఇనుప, ప్లాస్టిక్ సామాన్లు, డబ్బాల విక్రయానికి సంబంధించి కూడా టెం డర్లు ఉంటాయని, ఆసక్తి గల వారు 16వ తేదీ టెండర్లలో పాల్గొనాలని ఆయన కోరారు.

టెంకాయలు, తలనీలాల వేలంతో రూ.20 లక్షలు ఆదాయం

చాపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానంలో టెంకాయల విక్రయానికి, తలనీలాలు సేకరణకు సంబంధించి మంగళవారం వేలం నిర్వహించగా రూ.20,02,000 ఆదాయం వచ్చినట్లు ఆ దేవస్థానం చైర్మన్ పెరుగు వీరనారాయణ, ఈవో శంకర్‌బాలాజీ తెలిపారు. టెంకాయలు అమ్ముకునేందుకు కడపకు చెందిన వెంకట లక్ష్మి రూ.5.52 లక్షలకు, తలనీలాలు సేకరించుకునేందుకు బి.మఠంకు చెందిన రాజేష్ రూ.14.50 లక్షలకు వేలంపాడి దక్కించుకున్నట్లు వారు చెప్పారు. ఒక ఏడాది పాటు వారికి హక్కు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ డబ్బులను మైదుకూరులోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో జమ చేసినట్లు పేర్కొన్నారు. ఈ వేలంపాటను ప్రొద్దుటూరు దేవదాయశాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఆదరణ లేని వృద్ధురాలు బిడ్డల చెంతకు..



తల్లిని నిరాదరణకు గురిచేసిన కుమారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న జడ్జి

కడప రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆదరణ లేకుండా ఒంటరిగా జీవిస్తున్న వృద్ధురాలు బుసల లక్షుమ్మను డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ బిడ్డల చెంతకు చేర్చారు. కడప నగరం తారకరామ నగర్‌లో లక్షుమ్మ ఆదరణ లేకుండా ఒంటరిగా జీవిస్తున్నట్లు డీఎల్ఎస్ఏకు తెలిసిన వెంటనే జడ్జి స్పందించారు. ఈ మేరకు జడ్జి వృద్ధురాలితో మాట్లాడి నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నట్లు తెలుసుకున్నారు. బిడ్డలను డీఎల్ఎస్ఏకు రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కూతురు తమ వద్ద తల్లిని ఉంచుకోవడంతో పాటు పెద్ద కుమారుడు బుసల రమణ, రెండవ కుమారుడు బుసల చిన్నప్ప, మూడవ కుమారుడు బుసల చంద్రలు తల్లి లక్షుమ్మకు ప్రతి నెలా ఒక్కొక్కరు రూ.1500 ఇచ్చేలా ఒప్పుకున్నారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం గురించి జడ్జి తెలియజేశారు.

విజయదుర్గాదేవి ఆలయంలో రాహుకాల పూజలు



రాహుకాలపూజలు చేస్తున్న మహిళలు

కడప కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా రాయలసీమ ఇతర జిల్లాల నుంచి కూడా మహిళా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి సన్నిధికి చేరుకుని నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4-30 గంటల వరకు పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారి సేవలో తరించారు. కాగా ప్రతీ మంగళవారం, శుక్రవారం, పౌర్ణమి రోజుల్లో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమం, దీపాలంకారసేవ, నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు మల్లికార్జునరావు, నిర్వాహకుడు దుర్గాప్రసాద్ వెల్లడించారు.

వైద్య ఉద్యోగుల నిరసన



తాళ్లపల్లె పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న డాక్టర్లు, సిబ్బంది

వేంపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని వైద్య, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తాళ్లపల్లె ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది ఆసుపత్రి బయట నిరసన తెలిపారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తున్నప్పటికీ సరైన గుర్తింపు ప్రోత్సాహం లేదన్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలని డిమాండ్ చేశారు.

రబీ సీజన్‌కు అందుబాటులో ఎరువులు, విత్తనాలు



రైతులతో మాట్లాడుతున్న చంద్రానాయక్

లింగాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో పంటలు సాగుచేసే రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ఎరువులు, విత్తనాలను సరఫరాచేస్తోందని జిల్లా వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్ అన్నారు.లింగాల రైతు సేవాకేంద్రంలో మంగళవారం ఆయనరైతులకు డీఏపీ ఎరువుల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో పప్పుశనగ పంట సాగుచేసే రైతుల కోసం రెండురోజుల్లో విత్తన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తామని, రైతులు క్యూఆర్‌కోడ్ ద్వారా మాత్రమే చెల్లింపులు చేయాలన్నారు. అలాగే ఈనెల 25వ తేదీ లోగా ల్యాండ్ పార్శిల్ నమోదు పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. ఏఓ రమేష్, ఏఈఓ విక్టోరియారాణి రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆశా, పీహెచ్‌సీ వైద్యుల సమస్యలు పరిష్కరించండి

ధర్నాలో ఏఐటీయూసీ నాయకులు



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

కడప మారుతీనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తూ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న వైద్యుల సమస్యలను అలాగే కూటమి ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను త్వరితగతిన పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటి వేణుగోపాల్, నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి పిలుపు మేరకు మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి నేతలు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణం ఆశా కార్యకర్తలకు మెరుగైన వేతనాలు ఇస్తామని ఉద్యోగ భద్రత కల్పిస్తామనిసంక్షేమ పథకాలు వర్తిపజేస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, శాంతమ్మ, అనసూయ, ఏఐటీయూసీ నాయకులు కేసీ బాదుల్లా, చంద్రశేఖర్, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు పొందిన వారి వద్దనే కొనుగోలు చేయండి



వేరుశనగపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కమలాపురం రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనగోలు చేయాలని ఏవో సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలో రబీ సీజన్‌లో సాగు చేస్తున్న వేరుశనగ, మినుము, వరి వంటి వ్యవసాయ పంటలు,ఉద్యాన పంటలైన మామిడి, నేరేడు పంటలను వ్యవసాయ పరిశోధన స్థానం ఊటుకూరు కడప శాస్త్రవేత్త సునీల్‌కుమార్, ఎంటమాలజిస్ట్ మానస పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. మినుము లేదా శనగవిత్తనాలను టెబుకేనజోల్ ఒక కేజీ విత్తనానికి ఒక గ్రాముచొప్పున లేదా విటావాక్స్ పవర్ 1.5 గ్రాములు ఒక కేజీ విత్తనానికి కలిపి 24గంటల ముందు విత్తనశుద్ధి చేసుకోవాలని తెలిపారు. రశీదులు తప్పనిసరిగా డీలరు నుంచి తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు సురేఖ రైతులు పాల్గొన్నారు.

రేపు గాంధీ విగ్రహం వద్ద నిరసన

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కర్నూల్‌లో ఈనెల 16వ తేదీన నరేంద్రమోదీ పర్యటనకు నిరసనగా కడప నగరంలోని ఐటీఐ సర్కిల్ వద్ద గల గాంధీ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ ప్రకటన ద్వారా తెలిపారు. ప్రభుత్వ రంగంలో కడపకు ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటుచేస్తున్నట్లు మోదీ ప్రకటించాలన్నారు.

పకీర్‌పల్లెలో ప్రజాచైతన్య కార్యక్రమాలు



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్-1 వలంటీర్లు మంగళవారం పకీర్‌పల్లెలో ప్రజాచైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ ఎ.విజయ్‌కుమార్ విద్యార్థులతో కలిసి గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు.కార్యక్రమానికి ముందు నాగార్జున కళాశాల విద్యార్థులు ర్యాలీగా పకీర్‌పల్లెకు చేరుకొని సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను ఆపాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్, ప్రైవేట్, పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పేరుతో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు, జిల్లా నాయకులు జగదీష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ తర్వాత మిగిలిన ఖాళీపోస్టులకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించి, ఈ సంవత్సరంలో జూన్‌లో బదిలీపొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం కడప నగరం ఆర్టీయూపీ టీచర్స్ భవన్‌లో జిల్లా నాయకుల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు,రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళరెడ్డి,మహిళా కార్యదర్శి అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు. కాగా జిల్లాలో బదిలీ పొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం కడప నగరం డీఈఓ కార్యాలయంలో డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

సమస్యలపై నినదిస్తే కేసులా?

కడప సెవెన్‌రోడ్స్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నెలల తరబడి ఉన్న శ్మశాన, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కడప అలంఖాన్‌పల్లె 49వ డివిజన్ సచివాలయాన్ని ముట్టడించి సిబ్బందిని నిలదీసి ప్రశ్నించినందుకు దస్తగిరిపేట వాసులతో పాటు సీపీఐ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేయడం దారుణమని సీపీఐ సీనియర్ నాయకులు మనోహర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నగర కార్యవర్గ సభ్యులు పి.మల్లికార్జున, ఎస్.గౌస్‌లు ఖండించారు. సీపీఐ నగర కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కమలాపురం రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలత తెలిపారు. మంగళవారం స్థానిక చదిపిరాళ్ల సెక్టార్ కోగటం -4 అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా తల్లులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు పార్వతి, అరుణ, తల్లులు ,గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



సింహాద్రిపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలపనూరు ఎస్సీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ, ఇటీవల బదిలీపై కమలాపురం మండలం కోగటం పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయురాలు లావణ్యను ఘనంగా సన్మానించారు. మంగళవారం పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మురళీకృష్ణ,మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసులు,రిటైర్డ్ ఉపాధ్యాయుడు రాజేశ్వర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మెకు సంపూర్ణ మద్దతు

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ కార్మికులు నేటి నుంచి తలపెట్టిన సమ్మెకు సంపూర్ణమద్దతు తెలియజేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్, శ్రీనివాసులరెడ్డి, జిల్లాకోశాధికారి లక్ష్మిదేవి సంయుక్త ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలం అవుతున్నదని ఆవేదనవ్యక్తం చేశారు. కాగా కార్మిక సమస్యలను విద్యుత్ సంస్థల యాజమాన్యాలు, ప్రభుత్వం జోక్యం చేసుకొని హక్కులు నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ కార్మికుల కోర్కెలు తీర్చడంలో ప్రభుత్వాలు విద్యుత్ సంస్థల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు.

మూడు నుంచి భగవద్గీత పోటీలు

కడప మారుతీనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గీతాజయంతి సందర్భంగా టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్, కడప జిల్లాశాఖ ఆధ్వర్యంలో నవంబరు 30న ఆదివారం ఉదయం 9గంటల నుంచి నగర హౌసింగ్‌బోర్డు కాలనీ కోదండ రామాలయంలో భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి కడప జిల్లా ప్రోగ్రాం అసిస్టెంటు టి.గోపిబాబు తెలిపారు. ఇందులో 6వతరగతి నుంచి 9 వరకు విద్యార్థులకు శ్రీమద్ భగద్గీత 14వ అధ్యాయం గుణత్రయ విభాగ యోగంపై పోటీలుంటాయన్నారు. అలాగే 10, ఇంటర్ విద్యార్థులకు శ్రీమద్ భగవద్గీత 16వ అధ్యాయం దైవాసుర సంపత్ విభాగయోగం, అలాగే 18 నుంచి 40 సంవత్సరాల వారికి నిత్యం జీవితంలో భవద్గీత భావ విశ్లేషణ అంశంపై పోటీలుంటాయన్నారు. ప్రతి విభాగం నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఇతర వివరాలకు 9110779066ను సంప్రదించాలన్నారు.

వీసీని కలిసిన ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ నూతన వైస్‌చాన్సలర్ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్‌ను ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జానమద్ది శతజయంతి సభకు రండి

ఎస్పీడీసీఎల్ చైర్మన్‌ను కలిసిన సీపీ బ్రౌన్ సలహా మండలి సభ్యులు



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్పీడీసీఎల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన లోతేటి శివశంకర్‌ను సీపీ బ్రౌన్ లైబ్రరీ సలహా మండలి సభ్యుడు జానమద్ది విజయ భాస్కర్, డిక్కీ అధ్యక్షుడు శంకర్, రిటైర్డ్ ట్రాన్స్‌కో ఈఈ వి.రవీంద్ర తిరుపతిలో కలిసి సత్కరించారు. నవంబరు 2వ తేదీన కడపలో జరగబోయే జానమద్ది శత జయంతి సభకు రావాల్సిందిగా ఆహ్వానించారు.

అంజన్నను దర్శించుకున్న అనంతపురం జిల్లా జడ్జి



అంజన్న సేవలో జడ్జి శ్రీదేవి

చక్రాయపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామిని అనంతపురం జిల్లా జడ్జి దంపతులు శ్రీదేవి,రామారావు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఘనంగా పూజలు నిర్వహించారు. వారికి శాలువలు కప్పి ఆశీర్వాదాలు చేశారు. అనంతరం దేవస్థానం చరిత్ర, అంజన్న మహిమలు, పాపాఘ్ని నది చరిత్రను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రంగారావు, పోలీసులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వల్ల భవిష్యత్తు అంధకారం

కడప క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారమవుతుందని వక్తలు ఏడీ డిసబిలిటీ క్రిష్ణకిశోర్, కళాశాల కరస్పాండెంట్ బి.మధుసూదనరెడ్డి తెలిపారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఈగల్ టీం ఆధ్వర్యంలో కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు చేసే వ్యక్తుల సమాచారాన్ని పోలీసుశాఖకు తెలుపుతానని డిగ్రీ కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఎస్సీ ఏఎస్ఐ మల్లయ్య, ప్రిన్సిపాల్ కె.సూర్య నారాయణరెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్ శ్రీవాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తోడ్పాటు



పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శ్రీనివాసులును కలిసిన నాయకులు

కడప రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : పశువైద్యశాఖలో పనిచేసే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ తోడ్పాటు ఎల్లవేలలా ఉంటుందని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన ఇటీవల పశుసంవర్ధకశాఖ జేడీగా నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆయనను ఏపీ ఎన్జీవీఎఫ్ జిల్లా చైర్మన్ నంద్యాల రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటరీనేరియన్స్ ఫెడరేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యోగుల సమస్యలను తెలియజేశారు.

'రామకోటి రాసుకోండి'

కడప మారుతీనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో పాపాలు చేసిన ఆ పార్టీ నాయకులు కోటిసంతకాల సేకరణకు బదులుగా రామకోటి రాసుకోవాలని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానపురెడ్డి రవిశంకరరెడ్డిహితవు పలికారు. మంగళవారం కడపలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ హయాంలో మెడికల్ కాలేజీలన్నీ పూర్తి చేసినట్లుగా డబ్బా కొట్టుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. నాడు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రభుత్వ కోటాకు గాను 50శాతం సీట్లు కేటాయిస్తూ అప్పటి వైసీపీ ప్రభుత్వం జీవో నెం.107, 108, 133లను తీసుకురావడం నిజం కాదా అని ప్రశ్నించారు. పైపెచ్చు ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణాలకు కేంద్రం ద్వారా వచ్చిన నిధులు నాటి వైసీపీ ప్రభుత్వం ఎందుకు ఖర్చు పెట్టలేదని ప్రశ్నించారు. కాగా వాటి నిర్మాణానికి సాదాసీదాగా ఖర్చు చేసిన 1550 కోట్లు మొత్తం కూడా కేంద్రం ద్వారా వచ్చిన నిధులే అన్నా రు. అప్పట్లో జగన్ పాలనలో నిర్మాణాలు పూర్తయింది కేవలం 18 శాతం మాత్రమే అన్నారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు మెడికల్ కాలేజీల నిర్మాణం, లిక్కర్‌లో దొరికినప్పటికీ డ్రామాలు ఆడడం మానుకోవాలన్నారు.

కంకర పరిచారు... తారు మరిచారు



కంకర వేసి వదిలేసిన కల్లూరుపల్లె రోడ్డు

చక్రాయపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల ప్రాంతమైన కల్లూరుపల్లె, కాట్లగుంటవారిపల్లె, ఇసుకలోపల్లె తండా గామాలకు వెళ్లేందుకు తారురోడ్డు మంజూరైంది. అయితే ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్ మూడుకోట్లతో పనులు దక్కించుకున్నారు. పనులు వేగవంతం చేయాలని రోడ్డును తవ్వి కంకరపరిచారు. అనంతరం తార వేయడానికి చాలా సమయం పట్టిందని ప్రజలు వాపోతున్నారు. ఆ కంకర్లో దాదాపు ఆరు, ఏడు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది. గ్రామస్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు దెబ్బతినిపోతున్నాయని, నడవాలంటే మరింత ఇబ్బంది పడుతున్నామని ఆయా గ్రామ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైన కాంట్రాక్టర్ స్పందించి రోడ్డును పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు

కడప క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):కడప నగరం పూసలవీధికి చెందిన యువకుడికి ఉద్యోగం ఇప్పిస్తానంటూ డబ్బు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పూసలవీధికి చెందిన హరేరామ్ బీటెక్ పూర్తి చేసుకుని ఉద్యోగప్రయత్నం చేస్తున్న సమయంలో అనంతపురం జిల్లా నార్పలకు చెందిన ప్రసన్నకుమార్‌రెడ్డి పరిచయమై ఉద్యోగం ఇప్పిస్తానంటూ అతడిని నమ్మించి దాదాపు రూ.1.50లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం రాక తీసుకున్న డబ్బు ఇవ్వకపోవడంతో ఈ మేరకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ప్రసన్నకుమార్‌రెడ్డిపై చీటింగ్‌కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జీఎస్టీ ప్రయోజనాలు ప్రతి ఇంటికీ చేరాలి



కార్యక్రమానికి హాజరైన జడ్పీటీసీ లతారెడ్డి

పులివెందుల రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ ప్రయోజనాలు ప్రతి ఇంటికి చేరువ కావాలని జడ్పీటీసీ మారెడ్డి లత పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వ్యాపారులు, ప్రజలకు సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించగా జడ్పీటీసీ మారెడ్డి లత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చిన్నయ్య, కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ జ్ఞానానందరెడ్డి, మున్సిపల్‌కమిషనర్ రాముడు తదితరులుపాల్గొన్నారు.

గెస్ట్‌లెక్చరర్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి హిస్టరీ, హిందీ, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నెట్, టెట్, ఎంఫిల్, పీహెచ్‌డీ చేసి అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యతను ఇస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు, బయోడేటాతో హాజరుకావాలని తెలిపారు.

యువతకు క్రీడా పోటీలు

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం సహకారంతో ఈనెల 17వ తేదీన యువతకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు వికసిత ఫౌండేషన్ చైర్మన్ శూలం లక్ష్మీదేవి తెలిపారు. 17వ తేదీ అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలులో యువకులకు వాలీబాల్ పోటీలు, మహిళలకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని, 15 నుంచి 25 సంవత్సరాలలోపు యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. గెలుపొందినవారికి మొదటి బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.7 వేలను అందజేస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 9966475742 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ప్రైవేటు బ్యాంకులను జాతీయాకరణ చేయాలి



కర్ణాటక బ్యాంకు వద్ద నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రైవేటు బ్యాంకులను ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి జాతీయాకరణచేయాలని అఖిలభారత ప్రైవేటు బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు ప్రవీణ్‌కుమార్, సుధాకర్‌లు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం అఖిలభారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య పిలుపుమేరకు కర్ణాటక బ్యాంకు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న క్లరికల్, సబ్‌స్టాఫ్ నియామకాలను త్వరగా చేపట్టాలని డిమాండ్ చేశారు. పెడరల్ బ్యాంకులో వేతన సవరణ చేపట్టాలని కోరారు. ప్రైవేటు బ్యాంకు పెన్షనర్లకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రైవేటు బ్యాంకుల పెన్షన్ నిధిపై సీబీడీటీ మినహాయింపు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పవన్, సుబాష్ తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని ఏటీఎంతో ఇక్కట్లు

జమ్మలమడుగు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని ప్రొద్దుటూరు రోడ్డులో ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న స్టేట్ బ్యాంకుకు చెందిన ఏటీఎం గత అయిదు నెలల నుంచి పనిచేయకపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏటీఎం సక్రమంగా పనిచేయడంలేదని, నిరుపయోగంగా ఉందని సంబందిత అధికారులకు తెలియజేసినా స్పందన లేదని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా స్టేట్ బ్యాంకు అధికారులు ఖాతాదారులను దృష్టిలో ఉంచుకుని వెంటనే ఏటీఎంను వినియోగంలోకి తీసుకువచ్చి ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ధరలేక మొక్కజొన్నతో న(క)ష్టం

● మద్దతు ధరలేక తీవ్రంగా నష్టపోతున్నామంటున్న రైతన్నలు ● కలెక్టర్ స్పందించి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఆదుకోవాలంటూ వేడుకోలు

పోరుమామిళ్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో సాగుచేసిన మొక్కజొన్న పంటకు కనీస మద్దతు ధరలేక నిండామునిగామని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి తమను ఆదుకోవాలని లేదంటే ఆత్మహత్యలే శరణ్యమని రైతన్నలు వేడుకుంటున్నారు పోరుమామిళ్ల మండలంలోని చెర్లోపల్లె ఏరియాకు సంబంధించి కమర్షియల్ మొక్కజొన్న సాగు చేసిన రైతన్నలు నాలుగు నెలలు కష్టపడి పంట పండించిన తీరా చేతికొచ్చే సమయానికి వరుణదేవుడు తమపై



మొక్కజొన్నను ఆరబెడుతున్న రైతు

చిన్నచూపు చూస్తుండడంతో రెండు వారాలుగా రోడ్లపైనే ఆరబెట్టుకుని 250మంది రైతు కుటుంబాలు జాగారం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని టేకూరుపేట, సూరిసిద్దుపల్లె, బాలిరెడ్డిపల్లె, చిన్న యరసాల, పెద్ద యరసాల, తోకలపల్లెతో పాటు దాదాపు 2వేల ఎకరాలకు పైగా మొక్కజొన్న సాగు చేశారు. కమర్షియల్ పంటుల కాకుండా క్రాసింగ్ పంటలకు కంపెనీ వారు కొనుగోలు చేస్తారు. కానీ కమర్షియల్ మొక్కజొన్న సాగు చేసిన వారు వ్యాపారస్థులను కల్లాల్లోనే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెర్లోపల్లె ఏరియాలో దాదాపు 600 ఎకరాల్లో మొక్కజొన్నను సాగు చేశారు. ఎకరాకు రూ.40వేల దాకా పెట్టుబడి పెట్టామని 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశిస్తే 20 క్వింటాళ్లలోపే దిగుబడి వచ్చిందని కొండబోయిన బాలయ్య అనే రైతు వాపోయాడు. గత ఏడాది రూ.2500 క్వింటా ధర పలకగా ప్రస్తుతం రూ.1900 మాత్రమే పలుకుతుందన్నారు. అంతేకాక వ్యాపారస్థులు తేమ శాతం తగ్గిందని, మిషన్లతో పరీక్షలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. గతంలో సబ్సిడీకి పట్టలు ఇచ్చేవారని పట్టలు లేకపోవడంతో కొత్తవి కొనుగోలు చేసుకుని మొక్కజొన్నలను కాపాడుకోవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అంతేకాక చాలా మంది రైతులు ఉన్న పొలంతో పాటు ఇతర పొలాలను కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేస్తే దిగుబడి ధర రెండూ తగ్గాయని, కొనేందుకు కౌలుకూడా రావడంలేదన్నారు. కోతకు వచ్చే



ధాన్యం వద్ద కాపలాకాస్తున్న రైతన్న

సమయంలో మిషన్లు దొరక్క ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాల్లో మిషన్లు తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఎకరాకు 4వేలు ట్రాక్టరుకు వెయ్యి రూపాయలు అదనంగా చెల్లించాల్సి వచ్చిందని వాపోయారు. తడిచిన గింజలతో రెండు వారాలుగా రోడ్లపైనే జాగారం చేస్తూ మగ్గుతున్నామన్నారు. ఎక్కువగా కమర్షియల్ మొక్కజొన్నలను గుంటూరు, నంద్యాల ప్రాంతాలకు తీసుకువెళతారని వాటిని ఎక్కువా బీర్లు తయారికీ, చాపల కోళ్ల దాణాకు ఎక్కువగా ఉపయోగిస్తారని తెలిసింది. చాలమంది రైతులు అప్పులు చేసి పెట్టుబడులు వస్తాయా? రావా? అన్న ఆందోళనలో చెందుతున్నారు.

ఆ దారి రొచ్చు.. రొచ్చు

● అడుగు పెట్టాలంటే హడలిపోతున్న జనం

● పట్టించుకోని అధికారులు



దువ్వూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం నీలాపురంలో కొన్ని వీధులు రొచ్చు.. రొచ్చు గా మారాయి. వర్షాలు పడిన సమయంలో కొన్ని వీధులు జలమయంగా మారి మోకాటి లోతు నీరు నిలిచిన విషయం తెలిసిందే. అయితే నీరు పోయిన తర్వాత పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన గ్రామ పంచాయతీ అధి కారులు దానిని పట్టించుకోకపోవడంతో ఆ వీధు ల్లో అడుగు పెట్టాలంటేనే జనం హడలిపోతున్నారు. దీంతో దోమల బెడద అధికమై ప్రజలు రోగాలబారీన పడుతున్నారు. పంచాయతీ పరిధిలో 2011 జనాభా లెక్కల ప్రకారం 2,501 మంది జనాభా ఉన్నారు. నిరుపేదలు ఎక్కువగా ఉండే నీలాపురంలో జ్వరాలబారీన పడిన సమయంలో వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది.ఉన్నతాధికారులు శ్రద్ధ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ సెక్రటరి వెంకటేశ్వర్లు వద్ద ప్రస్తావించగా గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపడుతామన్నారు. వీధులు అపరిశుభ్రతను తొలగిస్తామని చెప్పారు.

భూసార పరీక్షల ఆధారంగా పంటలు వేయాలి

ముద్దనూరు అక్టోబరు14(ఆంధ్రజ్యోతి):భూసార పరీక్షల ఆధారంగా పంటసాగు చేస్తే మంచి ఫలితాలు సాధించగలరని ఇన్‌చార్జి డీడీఏ నాగరాజు రైతులకు సూచించారు. మండల పరిధి రాజులగురువాయపల్లె, పెనికెలపాడు గ్రామంలోని రైతులకు మంగళవారం భూసార పరీక్ష పై అవగాహన కల్పించారు. భూసార పరీక్షలకు అనుగుణంగా పంట మార్పిడి చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు వెంకటకృష్ణారెడ్డి, పద్మజ, సుచిత్ర పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

కాశినాయన అక్టోబరు14(ఆంధ్రజ్యోతి) అర్హులైన పేదలకు భూపంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నర్సాపురం తహసీల్దారు కార్యాలయంవద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజు కొనసాగాయి. ఈసందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతుంటే అధికారులు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. జిల్లా కార్యదర్శి అన్వేష్, కార్యవర్గ సభ్యుడు పోలయ్య పాల్గొన్నారు.

18న చెకుముకి సైన్స్ సంబరాలు

జమ్మలమడుగు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాలు మొదటగా పాఠశాల స్థాయిలో ఈనెల 18వ తేదీ జరుగుతాయని వాటినివిజయవంతం చేద్దామని జమ్మలమడుగు క్యాంబెల్ వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అగస్టిన్‌రాజు, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి డేవిడ్ సూచించారు. మంగళవారం సంబరాల పోస్టర్లను విడుదల చేశారు. జేవీవీ నేతలు పాల్గొన్నారు.

మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేకలకుంట్ల పంచాయతీలోని టి.రామాపురం ఎస్సీ కాలనీలో మౌళిక సదుపాయల అభివృద్ధి దిశగా చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే ఆదేశాలమేరకు సమస్యలు గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు, నాయకులు పరిశీలించారు. మండల అధికారులు టీడీపీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి తెలిపారు. మంగళవారం కళాశాలలో హైదరాబాదుకు చెందిన జెంట్రీల్యాబ్స్ సంస్థ బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులకు ఏఐ, ఎంఎల్ ఇంజనీరు ఉద్యోగాలకోసం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికల్లో సీఎస్‌ఈ విభాగం విద్యార్థులు హెస్సీబా, తేజశ్రీ, గురుజ్యోత్స్న, మహమ్మద్‌జాఫర్‌లు ప్రతిభ కనపరచి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి సంవత్సరానికి రూ.4 లక్షలు వార్షిక వేతనం లభిస్తుందని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, కళాశాల ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయాలి



ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ నాయకులు

బద్వేలు, అక్టోబర్ 14(ఆంధ్రజ్యోతి):పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ బకాయిలు 3వేల కోట్లు విడుదల చేయాలని సీపీఐ ఎంఎల్.లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబర్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో పెండింగ్ బకాయిలు చెల్లించి ఎన్‌టీఆర్ వైద్య సేవలను పునరుద్ధరించాలని కోరుతూ ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. పేదలకు ఉచితంగా వైద్యసేవలందించి ఆరోగ్యశ్రీ పథకం విషయంలో నిర్లక్ష్యం తగదన్నారు. ఇప్పటికే వైద్య ఖర్చులు భారీగా పెరిగాయని, ప్రభుత్వం పాత ధరలే ఇస్తుందని ఈ బిల్లులు కూడా సకాలంలో చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు

సీపీఆర్ విధానంపై అవగాహన పెంచుకోవాలి



సీపీఆర్ విధానంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి కళ్యాణ చక్రవర్తి

కాశినాయన అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) హృదయ శ్వాస పునరుద్ధరణ (సీపీఆర్) విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ కళ్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. మంగళవారం నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీపీఆర్ విధానంపై అవగాహనా కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి గుండె ఉన్నఫళంగా ఆగిపోయిన సందర్భంలో బాధితుడిని గట్టి నేలపై పడుకోబెట్టి ఛాతీపై రెండు చేతులు ఒకదానిపై మరొకటి పెట్టి నిమి షానికి 100 నుంచి 120 సార్లు గట్టిగా నొక్కాలన్నారు. ఇలా చేయడంవల్ల గుండె ఆగిపోయిన బాధితుడికి వైద్యసాయం అందేవరవకు ఇలాచేస్తే ఓప్రాణాన్ని కాపాడిన వారమవుతామన్నారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో నిర్మల, వీహెచ్‌ఎన్ శారద, హెచ్‌ఎస్ హుస్సేనమ్మ, చింద్రశేఖర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అత్యవసర సమయంలో సీపీఆర్ కీలకం



ర్యాలీ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు రక్షించేదుకు హృదయశ్వాస పునరుద్ధరణ (సీపీఆర్) ప్రాణాలను నిలబెట్టడంలో కీలకపాత్ర పోషిస్తుందని వైద్యాధికారి డాక్టర్ కిశోర్‌కుమార్ పేర్కొన్నారు. కామనూరు గ్రామంలో సీఆర్‌పీపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో బాధితున్ని గట్టినేలపై పడుకోబెట్టి చాతి మధ్యభాగంపై నిమిషానికి కనీసం 20 నుంచి 30సార్లు గట్టిగా నొక్కాలని చెప్పారు. ఇలా చేయడం వలన వైద్యసాయం అందేవరకు బాదితుడి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, చంద్రకళ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు యువత నడుంబిగించాలి



ఓటు హక్కు గురించి తెలుపుతున్న అధ్యాపకులు

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదు ప్రక్రియలో యువత చురుకైన పాత్ర పోషించాలని శ్రీ యోగివేమన యూనివర్సిటీ అనుబంధ సంస్థ అయిన శ్రీవేంకటేశ్వర డిగ్రీకళాశాల బి.మఠం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వ ర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపు లో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ మాధవరెడ్డి, ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి కిరణ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అందరూ కళాశాల నుంచి ప్లకార్డులు పట్టుకుని బిమఠం ఐదు రోడ్ల కూడలిలో మానవహారం చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఓటు ప్రాధాన్యతను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో భవన నిర్మాణాలకు ఊరట



ధరలు తగ్గిన వస్తువులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఓబుళమ్మ, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిన నేపథ్యంలో భవన నిర్మాణాలకు కావాల్సిన సామగ్రిపై ధరలు తగ్గి వినియోగదారులకు ఊరట లభించిందని జడ్పీ సీఈవో, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఓబుళమ్మ, స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో భవన నిర్మాణాలకు కావాల్సిన సిమెంటు, ఇటుక, టైల్స్ తదితర వాటిపై ధరలు తగ్గడంతో ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీఎస్టీ తగ్గుదలపై వివధ రంగాల్లో ప్రజలకు గత 20 రోజులుగా అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ప్రజలు తగ్గిన ధరలు అమలు అవుతున్నాయో లేదో పరిశీలించి కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ప్రొద్దుటూరు నియోకవర్గ స్పెషల్ ఆఫీసర్, జడ్పీ సీఈవో ఓబుళమ్మ మాట్లాడుతూ ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, రాజుపాళెం ఎంపీడీవో రామనాథరెడ్డి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రాజా నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అట్లూరులో జీఎస్టీ పై అవగాహన ర్యాలీ



జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్నటీడీపీ నాయకులు

అట్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అట్లూరు మండలంలోని కుంభగిరి పంచాయతీ పరిధిలోని గుజ్జులవారిపల్లె, ఎస్.వెంకటాపురం కాలనీలలో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడం వల్ల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని మండల యువ నాయకుడు పాలకొండు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. జీఎస్టీ 2.0పై గ్రామస్థులకు కిరాణా షాపుల వారికి కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కుంభగిరి ఎంపీటీసీ చిన్న గంగయ్య, బద్వేలు మార్కెట్‌యార్డు డైరెక్టరు కోడికూతల శివకుమార్, రఘురాంరెడ్డి, క్రిష్ణారెడ్డి, గోపాలయ్య, పరశురాముడు, పెంచలయ్య, నరసంహాలు, ఎల్లయ్య మల్లెంకొండయ్య, బాబు, ఆటో ఎల్లయ్య పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్‌లో : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ తగ్గింపుతో దేశంలోని చాలా వస్తువుల ధరలు తగ్గి ప్రతి కుటుంబానికి ఆదా అవుతుందని జిల్లా సహాయ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామలిగేశ్వర రెడ్డి అన్నారు. స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం దుకాణాదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ షాపులకు వచ్చే కస్టమర్లకు జీఎస్టీ తగ్గింపు చేస్తున్నట్లు తెలియచేయాలని సూచించారు. అందుకు సంబందించిన కరపత్రాన్ని షాపులకు అతికించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ స్పెషల్ ఆఫీసర్ చక్ర నాయక్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో నాగేంద్రబాబు, మున్సిపాలిటీ మేనేజర్ నాగార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికులను సంస్థలో విలీనం చేయండి

బద్వేలు, అక్టోబర్ 14(ఆంధ్రజ్యోతి):విద్యుత్ కార్మికులను సంస్థలో విలీనం చేయాలంటూ ఈ నెల 15న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కడప జిల్లా స్ట్రగుల్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, జిల్లా నాయకుడు ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం విద్యుత్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రేడ్ 2 కార్మికులకు న్యాయం చేయాలని, పాత పెన్షన్ పద్ధతిని పునరుద్ధరించేంతవరకు పోరాటాలు సాగించాలని, కారుణ్య నియామకాల్లో జరుగుతున్న అన్యాయాన్ని నివారించాలని, నగదు రహిత అపరిమిత మెడల్ పాలసిని వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆదినారాయణ, కార్మికులు తిరుపాల్, శంకర్‌రెడ్డి, సుధాకర్, పోలిరెడ్డి, జాన్సన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే సులభంగా విజయం సాధించవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలను అలవర్చుకోవడంతోపాటు సామాజిక సేవలో పాల్గొనాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యుల సమ్మెకు సిబ్బంది మద్దతు



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్యాధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యుల న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి చేస్తున్న సమ్మెకు వైద్యరంగ సిబ్బంది మద్దతు పలికారు. మంగళవారం కామనూరు పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 రోజులుగా న్యాయపరమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా వైద్యులు చేపట్టిన నిరసనపై ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వైద్యులు గ్రామీణ, దూర ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులతో సేవలు అందిస్తున్నప్పటికి వారికి సరైన గుర్తింపు, ప్రోత్సాహకం లభించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి కిశోర్‌కుమార్, సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, చంద్రకళ, సీనియర్ అసిస్టెంట్ మధు, ఫార్మసిస్టు సురేంద్ర, స్టాఫ్‌నర్సు సావిత్రి, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, సీహెచ్‌వోలు మెర్సీ, అంజలి, మీనా, గౌతమి, ప్రణీత, గంగాధర్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీటి రంగ నిపుణుడు సుబ్బరాయుడు మృతి

ప్రొద్దుటూరు , అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాయలసీమ సాగునీటి రంగ నిపుణుడు సిద్ధేశ్వరం అలుగు రూపకర్త రిటైర్డు డీఈ సుబ్బరాయుడు అనారోగ్యంతో మృతి చెందడం రాయలసీమ ఉద్యమానికి తీరని లోటని సీమ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ ఎస్పీ మహమూద్ ఓ ప్రకటనలో తెలిపారు. సిద్ధేశ్వరం అలుగు నిర్మాణంతోనే రాయలసీమ ప్రాజెక్టులకు సకాలంలో నిఖరజలాలు తీసుకోవచ్చని తక్కువ బడ్జెట్‌తో సుబ్బరాయుడు రూపకల్పన చేశారన్నారు. సిద్ధేశ్వరం ఉద్యమానికి సాంకేతిక సహకారం అందించడమే కాకుండా సీమ ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. నేడు కర్నూలులోని ఆయన స్వగ్రామంలో అంత్యక్రియలుజరుగుతాయని రాయలసీమ ఉద్యమ అభిమానులు పాల్గొనాలని కోరారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి

జమ్మలమడుగు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ఇబ్బందులున్నా వైద్యం కోసం ఇబ్బందులు పడి డబ్బులు ఆస్పత్రుల్లో చెల్లించుకున్న రోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, వారి ఆరోగ్యం కోసం సీఎం సహాయనిధి అందించడం జరిగిందన్నారు. సీఎం సహాయనిధి చెక్కులు అందుకున్న బాధితులు ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో 13 మంది లబ్ధిదారులకు రూ.9,45,642ల సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దముడియం టీడీపీ మండల కన్వీనర్ చిన్నపసుపుల శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.